

# 'అదే' కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

## 64

## పాణిగ్రహణం

**ఇండియాలో ఉద్యోగం** చేసే రోజుల్లో వచ్చే జీతం ఎక్కడికక్కడ సరిపోవడం, ఇంటి ఖర్చులకి పోయాక ఒక్క పైసా మిగిలినా ఎవరో ఒకరు ఏదో కొని తగలేయడం తెలుస్తూ ఉండే సరికి, మన తెలుగువాడు సుబ్బారావు అనుకున్న విషయం ఏమిటంటే తానెప్పటికీ పెళ్ళి చేసుకోడు. ఏదో విధంగా చేసుకుంటే మరో మనిషి ఇంట్లోకి వచ్చాక దెబ్బలాటలూ డబ్బులకీ ఎక్కడికక్కడ గొడవే కదా? అయినా పెళ్ళి అంత సులభంగా కుదరవద్దూ? అయితే సుబ్బాకి తొందర్లోనే ఈ పరిస్థితి మారిపోయింది – హెచ్ వన్ వీసామీద అమెరికా రాగానే. దూకితేగానీ లోతు తెలియదన్నట్టూ సుబ్బాకి మిగతా అసలు పెళ్ళి, సంసారం అనే విషయాలు తెలియడానికి చాలా సంవత్సరాలు పట్టింది.

అమెరికాలో దిగిన తర్వాత అంతకుముందొచ్చిన హెచ్ వన్ లతో రూమ్ లో చేరాక మాటల్లో తెల్సింది – పెళ్ళి చేసుకోవడం ఈ దేశంలో అతి సులభం. కానీ జాగ్రత్తగా ఉండకపోతే పీకల మీదకి రావొచ్చు సుమా! కొన్ని రోజులకి మరిన్ని విషయాలు తెలిసేయి. అమెరికాలో జీవితానికి జీతం సరిపోయి నెలాఖరికి మిగులు కూడా ఉంటుంది. తల్లీ తండ్రీ దగ్గర ఉండరు కనక 'చెప్పులోని రాయి' గొడవా, వాళ్ళకి నెలకి ఇంత అంటూ డాలర్లు పంపితే అవి రూపాయల్లో

హెచ్చుతాయి కనకా వాళ్ల 'చెవిలోని జోరీగ' గొడవ ఉండదు సుబ్బాకి. ఇంక మిగిలినది కూడా ఉండే ప్రేయసి. ఆవిడతో చెట్టాపట్టాల్ వేసుకుని 'చిటపట చినుకులు పడుతూ ఉంటే..... గట్టుమీద పడిపోతూ ఉంటే చెప్పలేని హాయి ఎంతో వెచ్చగ ఉంటుంది' కదా? కొత్తలో ఇదంతా సుబ్బాకి అర్ధంకాలేదు కానీ ఏడాది గడిచేసరికి మొత్తం కథ అర్ధమైంది. అలా పెళ్ళంటే ఉండే విముఖతలోంచి 'అబ్బే చేసుకోవచ్చు మరీ అంత పెద్ద గొడవకాదు' అనే స్థితిలోకి వచ్చాడు. మిగిలినది అమ్మాయిని వెతుక్కోవడం.

అలా తెలియనట్టు అడుగుతారేమిటండి, అమెరికాలో అమ్మాయి కావాలంటే ముందు తెల్లమ్మాయికి కదా ప్రిఫరెన్సు? దానికి ఆఫీసులో అమ్మడు మెలిసా సరిగ్గా సరిపోయింది సుబ్బాకి. ఆగండాగండి, తెల్లమ్మాయి దొరగ్గానే పెళ్ళైపోతుందా? డేటింగు చేసుకోవద్దూ? తెల్లమ్మాయిని చేసుకోవడానికి మొదటి రూల్ సుబ్బాకి అర్ధం అయిపోయింది అతి త్వరలో. ఆ రూల్ ప్రకారం ఆవిడ ఏమంటే అదే నిజమని ఒప్పుకొనుటా, మిగతా విషయాల్లో తన టెక్నాలజీ బుర్ర ఆవిడకి పంచుట. ఆవిడకి ఎప్పుడైతే 'మీ ఇండియన్స్ అందరూ తెలివైన వాళ్ళు' అనిపించిందో అప్పుడే సగం పెళ్ళైపోయినట్టే.

అలా రెండు నెలల డేటింగ్ తర్వాత సుబ్బా ఇండియాకి ఫోన్ లో చెప్పేడు – "మీ కాబోయే కోడలి పేరు మెలిసా" అంటూ. సుబ్బా తల్లికి నచ్చలేదు ఈ సంగతి. ఆవిడకి కోడలిచేత సేవలు చేయించుకోవడం కుదరదు అదీగాక మెలిసా తమని అమెరికా రానిస్తుందో లేదో తెలియదు కదా? కొడుకు తమ దగ్గిర ఉన్నట్టైతే పెద్ద గొడవ అయి ఉండేది కానీ కుర్రాడు వేల మైళ్ల దూరంలో ఉన్నాడు. అరిస్తే ఫోను పెట్టేస్తున్నాడు. మరో మూడు నెలలు గింజుకున్నాక అసలు విషయం చెప్పాడు సుబ్బా. ఆయనకి పెళ్ళైపోయి మూణ్ణెల్లు అయింది ఆల్రడీ! మరో ఆర్నెల్లలో జూనియర్ సుబ్బా రాబోతున్నాడు. ఏదైతేనేం సుబ్బాకి ఇండియాతో సంబంధం అలా తెగిపోయింది. డాలర్లు మాత్రం ఈయన పంపుతూంటే వాళ్ళు తీసుకుంటున్నారు.

పదేళ్ళయ్యేసరికి మెలిసాకీ ఈయనకీ గొడవలు మొదలై పెటాకులయ్యాయి. పుట్టిన ఇద్దరి పిల్లలకీ భరణం, ఈయన ఉండే ఇల్లూ, అవీ అమ్మగారికి ఇస్తారు. సుబ్బా వేరే ఉండాల్సిన పరిస్థితి. కొంతకాలం ఉన్నఊర్లోనే ఉన్నాక ఈ జీవితం దుర్భరం అనిపించి మరో ఊర్లో ఉద్యోగానికి సుబ్బా వెళ్ళిపోయేడు. మరో పదేళ్ళదాకా పిల్లలకి భరణం ఇచ్చుకోవాలి. జీవితంలో ఓ పెద్ద పాఠం నేర్చుకున్నాడు. పెళ్ళి చేసుకునేటప్పుడు అటూ ఇటూ అందరూ జాగ్రత్తగా చూసుకోవాలి అన్ని విషయాలు అనే విషయం. కొంచెం జాగ్రత్తలో ఉండాలి ఈ సారి.

కొత్త ఊర్లో మరో అమ్మడు పరిచయం అయింది. ఈ సారి పెళ్ళి చేసుకోవడానికి కొంచెం సందేహం. పిల్లలు పుట్టి మళ్ళీ పెటాకులైతే ఇక్కడ రెండో భరణం కష్టం కదా? అందువల్ల అమ్మడితో చెప్పి పిల్లలు అఖ్ఖర్లేకపోతేనే పెళ్ళి అనే ఉద్దేశ్యం బయటపెట్టాడు ఇప్పటికి నలభైల్లో అడుగెట్టిన సుబ్బా. ఆవిడకి కూడా మొదటి పెళ్ళి పెటాకులైన చోట ఓ కుర్రాడు ఉన్నాట్ట; అందువల్ల ఆవిడకి కూడా పిల్లలు అఖ్ఖర్లేదు. అయితే ఈ పెళ్ళైన సరిగ్గా ఏడాదికే అమ్మడికి ఈయన పద్ధతులూ,

గరం మసాలా, మజ్జిగ పులుసూ, బటర్ చికెన్ అవీ రోజూ తినడం నచ్చలేదు. సరిగ్గా ఏడాదిన్నరికి ఈ పెళ్ళి కూడా పెటాకులైంది. పిల్లలు వద్దనుకున్నారు కనక భరణం ఇవ్వక్కర్లేదు. ఈ లోపుల అమ్మడికి వేరే ఉద్యోగం వచ్చి అదే ఊర్లో మరో మూలకి మరిపోయేసరికి సుబ్బా కొన్నాళ్ళాగి మళ్ళీ వేటలో పడ్డాడు. ఉప్పూ కారం తినే మనిషేకదా, ఎవరో ఒకరు తోడు లేకపోతే ఏం బావుంటుంది జీవితం?

ఈసారి సుబ్బాకి ఎంత తీరిక ఉన్నా పెళ్ళి అంటే ఇష్టం పోయింది, రెండుసార్లు తలబొప్పి కట్టాక. అప్పుడు తెల్లాయనే అయిన కొలీగ్ ఒకడు సలహా ఇచ్చాడు – "హాయిగా ఉండండి, గర్ల్ ఫ్రెండ్ అని చెప్పుకుంటూ. ఆవిడ మీ ఇంట్లోనే ఉండొచ్చు, కార్యేషు దాసీ, శయనేషు రంభా అయినా పెళ్ళిచేసుకోనక్కర్లేదు. పెళ్ళి చేసుకుంటే లీగల్ గొడవలూ భరణం అవీ ఉన్నాయి కనక." ఇప్పుడు సుబ్బాగారు నిత్య బ్రహ్మచారి. ఇంట్లో ఉన్నావిడతో బోరుకొడితే ఆవిణ్ణి పంపించేసాక మరొకరు వస్తారు కొంత గేప్ తర్వాత. ఈయన్ని కలుసుకునే అమ్మడి గారి కలలు వేరు. అమ్మడు, ఆవిడకూడా వచ్చే ఒకరిద్దరి పిల్లలకీ కావాల్సినది అద్దె కట్టక్కర్లేని సుబ్బాగారి ఇల్లు;. వాళ్ళ అవసరం తీరకపోయినా, వాళ్ళకి ఈయన నచ్చకపోయినా ఎవరికి వారే యమునా తీరే. అలా సుబ్బాగారు సెటిలైపోయారు. దయచేసి గమనించండి. కథలో సుబ్బా బదులు సుబ్బి ఉన్నా ఈ ఆట సాగుతుంది. ఎందుకంటే కోర్టులో ఎప్పుడూ విజయం అమ్మగారికే రావడానికి ఆస్కారం ఎక్కువ. మైనర్ పిల్లలుంటే అమ్మగారి విజయశాతం మరింత ఎక్కువ.

నీతి: మొదటి పెళ్ళి అతి పునీతమైనది. రెండోది కొంచెం జాగ్రత్తతో వ్యవహించాలి. ఆ పై మూడు నుంచి పెళ్ళనేది 'గర్ల్ ఫ్రెండ్' పేరుతో సరదాగా ఆడుకునే ఆట.

Post your comments